# ఆహార ద్రవ్యోల్బణం.. కారణాలు.. నివారణ చర్యలు

**వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో ప్రభుత్వ జోక్యం ఎక్కువగా ఉంది. అయితే ఈ బాధ్యతను రెండో హరిత విప్లవం పేరిట వాల్‌మార్ట్, మోన్‌శాంటో వంటి బహుళ జాతి కంపెనీలకు ఇవ్వడానికి ప్రభుత్వం ఉత్సాహం చూపుతుంది. ప్రస్తుత ద్రవ్యోల్బణానికి సప్లయ్ వైపు కారకాలను ప్రధాన కారణంగా పేర్కొనవచ్చు. గోధుమ, పప్పు ధాన్యాలు, వంటనూనె, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల్లో చోటుచేసుకున్న ధరల పెరుగుదల.. ప్రాథమిక ఉత్పత్తుల్లో అధిక ద్రవ్యోల్బణానికి కారణమైంది. ఆసియా ఖండంలోని మిగతా దేశాలతో పోల్చితే భారత్‌లో వైట్ కాలర్ వేతనాలు పెరుగుతున్నాయి.**

ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరగడంతో.. భారత్‌లో 2007 సంవత్సరానికి ముందు అధిక ద్రవ్యోల్బణం నమోదైంది. అదే ఏడాది ప్రారంభంలో ఆహార ఉత్పత్తుల ధరల పెరుగుదల కూడా ద్రవ్యోల్బణానికి దారితీసింది. ఆహార ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఏర్పడడానికి ద్రవ్య సప్లయ్ పెరుగుదలతోపాటు అధిక వృద్ధి రేటును కూడా కారణాలుగా పేర్కొనవచ్చు. మరోవైపు వ్యవసాయ ఉత్పాదకతలో ఏర్పడిన స్తంభన.. సప్లయ్ వైపు నుంచి అధిక ధరలు నమోదయ్యాయి. అంతేకాకుండా ఆహార ఉత్పత్తుల ధరలతో పాటు ఇంధనం, సిమెంట్ ధరలు కూడా పెరిగాయి. 2007లో సగటు వార్షిక ద్రవ్యోల్బణం 5.3 శాతం కాగా 2008లో 5.9 శాతంగా నమోదైంది. ఇది 2009లో 7.8 శాతానికి పెరిగింది. టోకు ధరల సూచీ ఆధారంగా లెక్కించిన ద్రవ్యోల్బణం రేటు గత మూడేళ్లుగా పెరగడానికి ఆహార ఉత్పత్తుల ధరల్లోని పెరుగుదల కారణమైంది. డిసెంబర్ 2010లో టోకు ద్రవ్యోల్బణం 8.4శాతం కాగా జనవరి15, 2011 నాటికి ఆహార ద్రవ్యోల్బణం 15.5 శాతం. వృద్ధిని పెంపొందించే ద్రవ్యోల్బణ రేటును 5 శాతంగా కేంద్ర బ్యాంకు పరిగణిస్తుండగా 2010-11లో ద్రవ్యోల్బణం 9.4 శాతానికి చేరుకుంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రణాళికా సంఘ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లూవాలియా ప్రసంగిస్తూ.. ప్రజల సంపదలో పెరుగుదలను ఆహార ద్రవ్యోల్బణానికి కారణంగా పేర్కొన్నారు.

## డిమాండ్:

జనాభా వృద్ధి రేటు అధికంగా ఉండటం ఆహార డిమాండ్ పెరుగుదలకు దారి తీసింది. జనాభా వృద్ధికి అనుపాతంగా ఆహార ఉత్పత్తుల లభ్యత పెరగడం లేదు. ఫలితంగా ఆ ఉత్పత్తుల కొరత ఏర్పడి..



ఆహార ద్రవ్యోల్బణం పెరుగుతుంది. 2008-09లో భారత్‌లో తలసరి వార్షిక cereals (తృణ ధాన్యాలు) లభ్యత 165 కిలోలు. 2000-01 తర్వాత కూడా cereals తలసరి లభ్యతలో ఎటువంటి మార్పు లేదు. వీటి తలసరి లభ్యత 2008-09లో చైనాలో 290 కిలోలు కాగా అమెరికాలో 1000 కిలోలు. జీడీపీ వృద్ధి రేటు భారత్‌లో అధికంగా ఉన్నప్పటికీ.. వీటి తలసరి లభ్యత 2009-10లో 161 కిలోలకు తగ్గింది. భారత్‌లో అధిక వృద్ధి వల్ల లబ్ధి పొందుతున్న 10 నుంచి 15 శాతం వర్గాల ప్రజల వద్ద మాత్రమే ఆదాయం-వినియోగం వృద్ధి కేంద్రీకృతమవుతుంది. అర్జున్ సేన్ గుప్తా కమిషన్ నివేదిక ప్రకారం భారత్‌లో.. 77 శాతంమంది ప్రజలు రోజుకు ₹20 కంటే తక్కువ తలసరి వ్యయం చేయడాన్ని బట్టి దేశంలో ప్రజల వినియోగ స్థాయి ఏ విధంగా ఉందో ఊహించవచ్చు. మరో వైపు పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడే ప్రజల సంఖ్య దేశంలో పెరుగుతుంది. ఐక్యరాజ్యసమితి వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ అంచనా ప్రకారం.. ప్రపంచంలో ఆకలితో బాధపడుతున్న ప్రజల్లో 25 శాతం.. అంటే 925 మిలియన్ల మంది మన దేశంలోనే ఉన్నారు. మూడేళ్లలోపు పిల్లలలో సుమారు సగం మంది పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం గర్భిణి స్త్రీలలో సగం మంది రక్తహీనతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహార ద్రవ్యోల్బణం ఈ వర్గాల ప్రజల వినియోగ స్థాయిని ఇంకా దిగజార్చే అవకాశం ఉంది.

## కారణాలు:

కొన్ని రకాల ఆహార పదార్థాలు పప్పు ధాన్యాలు, పంచదార, ఉల్లిపాయల ధరల పెరగడానికి అక్రమ నిల్వలను కూడా కారణంగా పేర్కొనవచ్చు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై ప్రభుత్వం ప్రభావవంతమైన చర్యలు తీసుకోకపోవడంతో.. వారు మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టించి ధరల పెరుగుదలకు కారణమవుతున్నారు. ఆహార వ్యవస్థలో బహుళ జాతి సంస్థల ప్రవేశం కూడా ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఆహార ఉత్పత్తుల ధరల నియంత్రణపై ప్రభుత్వ నియంత్రణ తగ్గడానికి.. వ్యవసాయ వస్తువుల ఫ్యూచర్ ట్రేడింగ్, విదేశీ వాణిజ్యం కారణంగా పేర్కొనవచ్చు. ఆహార పంపిణీలో గత నాలుగేళ్లుగా కార్పొరేట్ రిటైల్ రంగం వాటా మూడు రెట్లు పెరిగింది. ముఖ్య

SAKSHI

ఆహార ఉత్పత్తులైన గోధుమ, పంచదార, ఉల్లిపాయల ఎగుమతుల, దిగుమతుల విషయంలో పెద్ద ట్రేడర్స్‌ను అనుమతించేలా వాణిజ్య విధానాలను రూపొందిస్తుంది. మరో వైపు ప్రజా పంపిణీ వ్యవస్థ అమల్లో ప్రతి దశలోను సంస్థాపరమైన బలహీనతలు పెరుగుతున్నాయి. ఆహార పంపిణీలో పలు రాష్ట్రాల్లో చౌక ధరల దుకాణాల పాత్ర, ఎన్‌ఏఎఫ్ఈడీ(నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) వంటి రాష్ట్ర ఏజెన్సీలు, వినియోగదారుల సహకార సంఘాల పాత్ర కూడా తగ్గింది. దీనికి తోడు ప్రైవేట్ ట్రేడర్స్ లాభాల మార్జిన్ పెరిగింది. దీని వల్ల హోల్‌సేల్, రిటైల్ ధరల మధ్య వ్యత్యాసం మరింత ఏర్పడింది. 1980లతో పోల్చినప్పుడు 1990లలో భారత వ్యవసాయ రంగంలో సంక్షోభం ఏర్పడింది. రుతుపవనాల అననుకూలతతోపాటు ప్రభుత్వరంగ పెట్టుబడులు తగ్గడం ఈ సంక్షోభానికి కారణాలు. గత 15ఏళ్లుగా వ్యవసాయ రంగంలో సంక్షోభం వల్ల 2.5 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు చర్యల్లో ప్రభుత్వ జోక్యం కూడా చాలా తక్కువ. రెండో హరిత విప్లవం పేరిట రిటైల్ దిగ్గజాలైన వాల్‌మార్ట్-మోన్‌శాంటోలకు ఈ బాధ్యతను ఇవ్వడానికి ప్రభుత్వ ఉత్సాహం చూపుతుంది. ఈ చర్య చిన్న, సన్నకారు రైతుల స్థితిని ఇంకా దిగజార్చగలదు.

కొన్ని ముఖ్య ఉత్పత్తుల మద్దతు ధరలను నిర్ణయించే విషయంలో లోపాలు వాటి ఉత్పత్తుల ఒడిదుడుకులకు కారణమై తద్వారా ఆయా ఉత్పత్తుల కొరత ఏర్పడి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతమవడం, ప్రజల వ్యయార్హ ఆదాయాల (Disposable income) పెరుగుదల, ఇటీవలి కాలంలో విస్తరణ కోశ ద్రవ్య విధానాలు అమలు వల్ల పరపతి ప్రేరిత ద్రవ్యోల్బణం ఏర్పడింది. ప్రభుత్వం చమురు ధరల నిర్ణయంలో పాక్షికంగా వైదొలగడం వాటి ధరల పెరుగుదలకు కారణమైంది. తద్వారా ఆహార ఉత్పత్తుల రవాణా వ్యయం అధికమైంది. ఈ అంశం కూడా ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమైంది.

ప్రస్తుత ద్రవ్యోల్బణానికి సప్లయ్ వైపు కారకాలను కారణాలుగా పేర్కొనవచ్చు. డిమాండ్‌తో పోల్చినప్పుడు స్వదేశీ ఉత్పత్తి తగ్గుదల, అంతర్జాతీయంగా ఫుడ్ ఐటమ్స్ ధరలు అధికమవడంతో ప్రాథమిక ఉత్పత్తుల ధరలో పెరుగుదల సంభవించింది. గోధుమ, పప్పు ధాన్యాలు, వంట నూనె, పండ్లు, కూరగాయలు, సుగంధద్రవ్యాల ధరలు ప్రాథమిక ఉత్పత్తుల్లో అధిక ద్రవ్యోల్బణం ఏర్పడడానికి కారణమయ్యాయి. ఆసియాఖండంలోని మిగతాదేశాలతో పోలిచినప్పుడు భారత్‌లో వైట్‌కాలర్ వేతనాలు పెరుగుతున్నాయి.

### ఫ్యూచర్ ట్రేడింగ్:

2002-03 తర్వాత భారత్‌లో బహుళ-వస్తు ఎక్స్ఛేంజ్(మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్)లు ఏర్పడి ఆన్‌లైన్ ట్రేడింగ్, వస్తు ఫ్యూచర్ ట్రేడింగ్ పెరిగింది. ప్రపంచంలోని ఇతర దేశాల మాదిరిగా ఈ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్న వారు రైతులు కాదు. అంచనా వ్యాపారం ద్వారా లబ్ధి పొందే ఉద్దేశంతో ఫైనాన్షియల్ మార్కెట్‌కు సంబంధించిన బిగ్ ప్లేయర్స్ పెట్టుబడులను ఈ మార్కెట్‌కు తరలిస్తున్నారు. 2007లో ముఖ్య ఆహార ఉత్పత్తులైన బియ్యం, గోధుమ, పంచదార, పప్పుధాన్యాలను ఫ్యూచర్ ట్రేడింగ్ నుంచి నిషేధించాలని లెఫ్ట్ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. ఫలితంగా కొంత కాలం నిషేధం విధించినప్పటికీ.. తర్వాత గోధుమ, పంచదారకు మినహాయింపునిచ్చారు.

## నివారణ చర్యలు

- ఆహార ద్రవ్యోల్బణం నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రభావవంతంగా లేవు. ఆహార పంపిణీ, ఉత్పత్తిలో ప్రభుత్వ జోక్యం మరింత పెరగాలి. అణచివేసే ద్రవ్యోల్బణం (suppressed inflation) పద్ధతి ద్వారా ధరల సీలింగ్ వంటి విధానాన్ని అవలంబించడంతో భవిష్యత్తులో ఆహార ఉత్పత్తులు తగ్గి తీవ్ర ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుంది.
- ఆహార భద్రత చట్టాన్ని తక్షణమే ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద 50 మిలియన్ టన్నుల బియ్యం, గోధుమ నిల్వలు ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా లేదా చౌక ధరల దుకాణాల ద్వారా వీటిని లక్షిత వర్గాల ప్రజలకు అందించే క్రమంలో అసలైన లబ్ధిదారులను గుర్తించాలి. ఈ వ్యవస్థ ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు సబ్సిడీ ధరల వద్ద నెలకు 35 కిలోల ఆహార ధాన్యాలను అందించాలి. ఆహార ధాన్యాలతోపాటు పంచదార, పప్పు ధాన్యాలు, వంటనూనె వంటి ఉత్పత్తులను లక్షిత వర్గాలకు సరఫరా చేయాలి.
- జాతీయ రైతు కమిషన్ సిఫారసులను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలి. కమిషన్ సూచించిన విధంగా చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయం లాభదాయకంగా ఉండేలా ప్రభుత్వరంగ పెట్టుబడులను పెంచాలి. అదే విధంగా మార్కెటింగ్, స్టోరేజీ సౌకర్యాలను మెరుగుపరచాలి.
- రైతులకు ప్రోత్సాహకాలు అందించడంతోపాటు ప్రభుత్వ ఏజెన్సీలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలతో కూరగాయలు, పండ్లు వంటి ఆహార ఉత్పత్తులను విక్రయించడానికి అవుట్‌లెట్స్‌ను ఏర్పాటు చేయాలి. వ్యవసాయ ఉత్పాదకత పెంపు విషయంలో ప్రభుత్వ జోక్యం ఎక్కువగా ఉండాలి.
- కమతాల సమీకరణ, పంటల మార్పిడి, సహకార వ్యవసాయం వంటి విధానాలను ప్రోత్సహించాలి. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, స్టోరేజీ, మార్కెటింగ్ సౌకర్యాలను ఆధునికీకరించడం వంటి బాధ్యతలను పూర్తిగా బహుళజాతి సంస్థలకు అప్పగించరాదు. వ్యాపార సరళీకరణ ద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించలేమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.
- ఆహార వ్యవస్థలో ప్రైవేట్ కార్పొరేట్ రంగం, ట్రేడర్ల ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించాలి. 'వ్యవసాయ వ్యయాలు-ధరలు కమిషన్'

SAKSHI

సూచించిన విధంగా వ్యవసాయ కార్యకలాపాల ప్రారంభానికి ముందే ముఖ్య ఉత్పత్తులకు సంబంధించి మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి. తద్వారా రైతులలో తమ ఆదాయం పట్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

- ఆహార ఉత్పత్తుల నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. ఫ్యూచర్ ట్రేడింగ్‌ని నిషేధించాలి. వ్యవసాయ ఉత్పాదితాల ధరలను ప్రభుత్వమే నియంత్రించాలి. ఇంధనం, ఎరువుల ధరల డీరెగ్యులేషన్ కారణంగా వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు పెరిగి ఆహార ద్రవ్యోల్బణానికి కారణమవుతుంది. ఇంధనం, ఎరువులపై సబ్సిడీ విధానాన్ని కొనసాగిస్తూ పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులను సరళీకరించాలి.

SAKSHI